సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 29 । ఫిబ్రవరి । 2024



శ్రీవారి శోభ పెంచేలా అభివృద్ధి

ద్వారకాతిరుమలలో శ్రీవారి శోభను మరింత పెంచేలా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టినట్లు దేవదాయ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ చెప్పారు. 8లో ▸



గోడ కూలి చిన్నారి మృతి

తణుకులో శిథిలావస్థలో ఉన్న గోడ కూలి ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. 8లో ▸



పట్టిసంలో ఏర్పాట్లపై సమీక్ష

పట్టిసంలో మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు అధికార యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేయాలని జేసీ లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. 8లో ▸

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షులుగా సత్యవేదం

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షులుగా డాక్టర్ ఎ.సత్యవేదంను నియమిస్తూ వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నగర కమిటీలో నూతనంగా ఉప్పాల ఆంజనేయులు, జంగం నారాయణను నియమించారు. అదేవిధంగా ఏలూరు నగర బీసీ సెల్‌లో ఘంటశాల వెంకటరమణ, కాటూరి లక్ష్మీమాధవరావు, పిల్లంగోళ్ళ సత్యదేవ్‌ను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వివరాలను ఏలూరు నగర అధ్యక్షులు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ బుధవారం పత్రికలకు విడుదల చేశారు.

1 నుంచి ఎంఎస్ఎంఈ సర్వే

ఏలూరు (మెట్రో): చిన్న, మధ్యతరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరచి డేటా బేస్ అభివృద్ధి పరిచేందుకు మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు సపోర్ట్ మొబైల్ యాప్‌తో జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహిస్తామని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఏపీ ఎంఎస్ ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓ ఆదేశాలతో చేపట్టిన ఈ సర్వే కోసం నియమించిన బృందానికి ఎంఎస్ఎంఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు వర్తక వాణిజ్య సంఘాలు సర్వేకు అవసరమైన వివరాలు అందించి సహకరించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు సెక్రటరీలు ఈ సర్వే చేస్తారన్నారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, అదనపు డెవలప్‌మెంట్ కమీషనర్ల ద్వారా ఈ సర్వే పురోగతిని జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా కలెక్టర్ వారి ఆధ్వర్యంలో పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు.

టెట్‌కు 679 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం జరిగిన పరీక్షలకు మొత్తం 679 మంది హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ నిర్వహించిన ఈ పరీక్షకు 366 మందికి 340 మంది హాజరు కాగా, 26 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 367 మందికి 339 మంది హాజరు కాగా, 28 మంది గైర్హాజరయ్యారు. మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చెప్పారు.

పశ్చిమగోదావరి జిల్లాలో 182 మంది హాజరు

భీమవరం: భీమవరంలోని డీఎన్నార్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షకు 23 మంది గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ చెప్పారు. మూడు షిఫ్టుల్లో జరిగిన ఈ పరీక్షకు 205 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 182 మంది హాజరయ్యారన్నారు. ఏవిధమైన మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈఓ తెలిపారు.

ఎన్నికల ప్రచారాల్లో బాలలను వాడొద్దు



మాట్లాడుతున్న డీఆర్‌వో డి.పుష్పవాణి

ఏలూరు (మెట్రో): రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సమావేశాలు, ప్రచారం, ర్యాలీలు, తదితర ఏ రూపంలో కూడా బాలలను భాగస్వామ్యం చేయవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేశారని డీఆర్వో డి.పుష్పవాణి చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఓటర్ల జాబితా ప్రచురణ, పోలింగ్ స్టేషన్‌లలో మౌలిక సదుపాయలు, పోలింగ్ శాతం పెంపు వంటి అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఫారం-7 కింద అందిన దరఖాస్తులను జిల్లా స్థాయి కమిటీ వాటిని క్షుణంగా పరిశీలించిందన్నారు. ఈ మేరకు జిల్లా ప్రధాన ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ అనుమతితో ఫారం-7 కింద 1,595 తొలగింపులకు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి 6,066 తొలగింపులకు అనుమతించారన్నారు. ఫారం-ఎను సీఈఓకు, ఫారం-ఎ, బీలను రిటర్నింగ్ అధికారులకు అందించాల్సిన బాధ్యత సంబంధిత పార్టీ లేదా అభ్యర్థులపై ఉందన్నారు. ఫారం-ఏ, బీ రెండూ సంబంధిత ఆర్వోలకు సమర్పిస్తేనే వారిని రాజకీయ పార్టీ అభ్యర్థులుగా పరిగణిస్తారని వివరించారు. గత నెల 6 నుంచి ఈ నెల 28 వరకు వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు ఫారం-6 కింద 1,224, ఫారం-7 కింద 1,777, ఫారం-8 కింద 861 దరఖాస్తులను పరిష్కరించామని, మరో 3,862 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని వివరించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు దేవరపల్లి రత్నబాబు (బీఎస్పీ), నెరుసు నెలరాజు (బీజేపీ), పి.ఆదిశేషు (సీపీఎం), ఎస్వీ ప్రసాద్ (కాంగ్రెస్), ఎస్.అచ్యుతబాబు (టీడీపీ), కలెక్టరేట్ ఏఓ కె.కాశీవిశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

భీమవరం: భీమవరంలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బుధవారం కాళ్ల మండలం పెద అమిరంలోని హెలీప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. మధ్యాహ్నం 3.42 గంటలకు హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గంలో రాధాకృష్ణ కన్వెన్షన్‌కు సీఎం జగన్ చేరుకున్నారు. వైఎస్సార్ సీపీ నేత గుణ్ణం నాగబాబు కుమారుడు మణికంఠ వెంకట సుబ్బారావు (సుభాష్)-విజయదీప్తి దంపతులను సీఎం జగన్ ఆశీర్వదించారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, విప్ గ్రంధి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, తలారి వెంకట్రావు, పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపీ, కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ, ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ అజిత

పీహెచ్‌సీలకు కొత్త రూపు

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజారోగ్యానికి పెద్దపీట వేశారు. ప్రజలకు స్థానికంగా వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణంపై ప్రభుత్వం దృష్టి సారించింది. మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా వైద్యులు, సిబ్బంది, పరికరాలను ఏర్పాటు చేయడమే కాక పక్కా భవనాలనూ నిర్మిస్తూ పూర్తి స్థాయిలో వైద్య సేవలను ప్రజలకు చెంతకు తీసుకువస్తోంది. అందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో శిథిలావస్థ, అద్దె భవనాల్లో ఉన్న అర్బన్, గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాలను సమకూరుస్తోంది.

- జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు కొత్త భవనాలు
- రూ.7.20 కోట్ల వ్యయంతో 9 యూపీహెచ్‌సీల నిర్మాణం
- రూ.8.94 కోట్లతో 6 పీహెచ్‌సీలకు పక్కా భవనాలు
- పల్లెల్లో మరింత మెరుగుపడనున్న సర్కారు వైద్య సేవలు



పాలకొల్లు మండలం లంకలకోడేరు నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం

భీమవరం (ప్రకాశం చౌక్): నాడు-నేడు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.16.14 కోట్ల వ్యయంతో జిల్లాలో 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పక్కా భవనాలను నిర్మించింది. అందులో 9 చోట్ల అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించింది. ఒక్కొక్క భవనం రూ.80 లక్షలతో 9 భవనాలు నిర్మించగా అందు కోసం రూ.7.20 కోట్లు ఖర్చు చేసింది. పల్లె ప్రజలకు వైద్య సేవలు అందించే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 6 చోట్ల ఒక్కొక్క భవనం రూ.1.49 కోట్లతో 6 భవనాలను రూ.8.94 కోట్ల వ్యయంతో నిర్మించింది. వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్ని రకాల సౌకర్యాలతో ఉండేలా ఈ భవనాలు నిర్మించారు. ప్రతి భవనంలో వైద్యులకు ప్రత్యేక గదులు, మందులు, ల్యాబ్, డెలివరి రూమ్, పేషెంట్లు విశ్రాంతి, ఇన్ పేషెంట్ రూమ్‌లు, టాయిలెట్స్ తదితర సౌకర్యాలను కల్పించారు.

12 భవనాలు అందుబాటులోకి..

జిల్లాలో నిర్మించిన 15 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నూతన భవనాల్లో ఇప్పటికే 12 భవనాల నిర్మాణాలను పూర్తి చేయడమే కాక వాటిలో వైద్య సేవలు ప్రారంభించారు. మిగిలిన వాటిలో భవనాల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్-1, ఫార్మాసిస్టు 1, స్టాఫ్ నర్సులు 2, ల్యాబ్ టెక్నీషియన్, సూపర్‌వైజర్లు 2 సేవలు అందిస్తారు. వైద్య సేవలు విషయానికి వస్తే 14 రకాల పరీక్షలు, 100 రకాల మందులు, సహజ డెలివరీలు, బీపీ, సుగర్, జ్వరాలు, పాము కాటు, కుక్క కాటు వ్యాక్సినేషన్, ఇతర వైద్య సేవలు అందిస్తున్నారు.

బాబు పాలనలో అధ్వానం

నాడు చంద్రబాబు పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అగమ్యగోచరంగా మారాయి. సరైన భవనాలు, వైద్య సేవలు కరువయ్యాయి. అరకొర మందులు, అప్పుడప్పుడూ వచ్చే డాక్టర్, కాలక్షేపం చేసే వైద్య సిబ్బంది. ఇది బాబు పాలనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రల పరిస్థితి. కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద పశువులు, రాత్రులు జూదాలు, మద్యం సేవించే వారికి నిలయంగా ఉండేవి. నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలు మారి పూర్తి భద్రతతో ఆరోగ్య కేంద్రాలు వైద్య సేవలకు నిలయంగా ఉన్నాయి.

పూర్తి స్థాయిలో వైద్య సేవలు



జిల్లాలో 15 అర్బన్, గ్రామీణ ప్రాంత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు నూతనంగా పక్కా భవనాలు నిర్మించాం. వాటిలో 90 శాతం భవనాలు అందుబాటులోకి తీసుకువచ్చి పూర్తి స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తాం. మిగిలిన వాటిని కూడా వేగంగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నాం. పూర్తి స్థాయిలో వైద్యులు, సిబ్బంది, మందులు అన్ని ఉండేలా చర్యలు తీసుకున్నాం.

– డి.మహేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్ఓ, భీమవరం

జిల్లాలో పీహెచ్‌సీ భవనాల వివరాలు

ప్రాంతం	పీహెచ్‌సీల భవనాలు	ప్రాంతం	పీహెచ్‌సీల భవనాలు
భీమవరం టౌన్	3	లంకలకోడేరు	1
తాడేపల్లిగూడెం	2	ముదునూరు	1
నరసాపురం	1	మంచిలి	1
పాలకొల్లు	1	మేడపాడు	1
తణుకు	1	ఆచంట వేమవరం	1
ఆకివీడు	1	కాళ్ల	1



భీమవరంలో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

అభ్యర్థుల ఖర్చు పక్కాగా లెక్కించండి

కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

భీమవరం (ప్రకాశంచౌక్) రానున్న ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థుల ఖర్చుల నివేదికలు పకడ్బందీగా సిద్ధం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశం మందిరంలో ఎన్నికల వ్యయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వీటిపై సందేహాలు ఉంటే సంబంధిత నోడల్ అధికారులను సంప్రదించాలన్నారు. ఎన్నికల ఖర్చుల రకాలు, ఎంసీఎంసీ బృందాలు నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.95 లక్షల వరకు, శాసనసభ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేసేందుకు అనుమతి ఉందన్నారు. ఇంతకుమించి ఖర్చు చేస్తే ఆయా అభ్యర్థులు అర్హత కోల్పోతారన్నారు. అన్ని బృందాలు వారికి అప్పగించిన విధంగా అభ్యర్థుల ఖర్చుల వివరాలను సంబంధిత రిజిస్టర్లలో నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు వారి ఖర్చులు నివేదికలను మూడుసార్లు వ్యయ పరిశీలకులకు చూపించాల్సి ఉంటుందన్నారు. రూ.10 లక్షలకు మించి ఎక్కడైనా నగదు పట్టుకున్న పక్షంలో ఆదాయపు పన్ను అధికారికి తెలియజేసి సీజ్ చేయించాలన్నారు. ఎవరైనా సరే రూ.50 వేలకు మించి నగదు తరలిస్తుంటే పట్టుకోవాలని, రూ.10 వేల విలువ చేసే బహుమతులు, వివిధ రకాల వస్తువులు తీసుకువెళుతుంటే సీజ్ చేయాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలు కోసం తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ నుంచి అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డీఆర్వో బి.శివన్నారాయణ రెడ్డి, ఆర్డీవోలు కె.శ్రీనివాసులురాజు, అచ్యుత్ ఆనంద్, చెన్నయ్య, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కర్షకులకు వెన్నుదన్నుగా రైతు భరోసా

- పశ్చిమ కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ
- రైతు భరోసా, సున్నా వడ్డీ పంట రుణాలు, వడ్డీ రాయితీ సొమ్ము చెక్కుల అందజేత



భీమవరంలో రైతులకు నమూనా చెక్కు అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

భీమవరం: కౌలు, సన్న, చిన్నకారు రైతులకు వెన్నుదన్నుగా వైఎస్సార్ రైతు భరోసా నిలుస్తుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. బుధవారం భీమవరం కలెక్టరేట్‌లో ఈ ఏడాది మూడో విడతగా వైఎస్సార్ రైతు భరోసా-పీఎం కిసాన్, వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు, వడ్డీ రాయితీ సొమ్మును అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కౌలు రైతులు పెట్టుబడి సాయం వినియోగించుకుని మంచి దిగుబడులతో లబ్ధి పొందాలన్నారు. తుపాను, వరదల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఏ పంటకాలంలో దెబ్బతింటే ఆ పంటకాలం ముగిసేలోగా పెట్టుబడి సహాయాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేసి వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కౌలు రైతులు కుటుంబాలకు సాయం అందించడం అభినందనీయమన్నారు. ఐదో ఏట మూడో విడతగా రైతు భరోసా – పీఎం కిసాన్ పథకంలో జిల్లాలోని 1,27,114 మంది రైతులకు రూ.25.42 కోట్లు, సున్నా వడ్డీ పంట రుణాల కింద 39,270 మంది రైతులకు రూ.5.53 కోట్లు రెండు నమూనా చెక్కులను కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు రైతులకు అందజేశారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సలహా మండలి సభ్యుడు కొట్టి కుటుంబరావు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

హైస్కూల్ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జంగారెడ్డిగూడెం: విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన జంగారెడ్డిగూడెం హైస్కూల్ స్కాట్ ఉపాధ్యాయుడు ఎం.శ్రీహరిబాబును ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. బాలికల తల్లిదండ్రుల ఫిర్యాదుల మేరకు జంగారెడ్డిగూడెం పోలీసులు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్, స్కాట్ ఉపాధ్యాయుడు ఎం.శ్రీహరిబాబు తనకు సంబంధం లేని 9, 10 తరగతుల విద్యార్థినులతో గతంలో అసభ్యకరంగా ప్రవర్తించాడు. మంగళవారం కూడా అలాగే ప్రవర్తించడంతో పదో తరగతి విద్యార్థినులు హెచ్ఎం లోవకుమారికి ఫిర్యాదు చేశారు. అంతేకాక ఇంటికి వెళ్లి విద్యార్థినిలు తల్లిదండ్రులకు చెప్పడంతో బుధవారం వారు హైస్కూల్‌కు వచ్చి ఆందోళనకు దిగి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎంఈవో బి.రాముడు, ఎస్సై జి.జ్యోతిబాస్, జెడ్పీటీసీ సభ్యుడు పోల్నాటి బాబ్జి హైస్కూల్‌కు చేరుకున్నారు. ఎంఈవో రాముడు విద్యార్థినుల నుంచి వివరాలు సేకరించి నివేదికను డీఈఓకు పంపారు.



జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో విచారణ చేస్తున్న ఎంఈవో రాముడు, ఎస్సై జ్యోతిబాస్

డీఈఓ ఉత్తర్వులు జారీ

ఏలూరు (టూటౌన్): జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ హైస్కూలులో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు ఎం.శ్రీహరిబాబును సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అబ్రహం బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రోత్సాహం

ఢిల్లీలో వీసీ టు విలేజ్ పుస్తకావిష్కరణలో ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ టి.జానకీరామ్



వీసీ టు విలేజ్ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో వీసీ జానకీరామ్ తదితరులు

తాడేపల్లిగూడెం: ఉద్యాన పంటల మోడల్ గ్రామాల అభివృద్ధికి డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం చేపట్టిన మన గ్రామం - మన విశ్వవిద్యాలయం కార్యక్రమంపై ప్రచురించిన పుస్తకావిష్కరణ కార్యక్రమం న్యూఢిల్లీలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మూడేళ్ల విజయవంతంగా ఎలా నిర్వహించారో వివరిస్తూ పుస్తకాన్ని ఉద్యాన వర్సిటి ప్రచురించింది. జాతీయ స్థాయిలో ఢిల్లీలో వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఉప కులపతులు, ఐసీఏఆర్, జాతీయ సంస్థల సంచాలకుల సదస్సు 26, 27 తేదీల్లో జరిగింది. ఈ సందర్భంగా భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సంచాలకులు డాక్టర్ హిమాన్షు సాధక్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఇలాంటి కార్యక్రమాలు ద్వారా గ్రామాల్లో ఉద్యాన పంటల్లో నూతన విధానాలను ప్రోత్సహించడం, గ్రామీణ విద్యార్థులను ఉద్యాన విద్య వైపు ఆకర్షించడం, రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పండ్ల మొక్కల పెంపకం, పెరటి తోటల పెంపకం వంటి కార్యక్రమాలు చేపట్టడానికి అవకాశం కలుగుతుందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఉత్తమ ఫలితాలనిచ్చిందని వీసీ జానకీరామ్ చెప్పారు. రైతుల అనుభవాలను, ఇతరుల దగ్గర సలహాలు తీసుకుని కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక గ్రామీణ అభివృద్ధి కార్యక్రమం ఉన్నత భారత్ అభియాన్‌ను సమన్వయం చేసి, మరిన్ని కార్యక్రమాలు గ్రామాల్లో చేపడతామన్నారు. ఈ వివరాలను వర్సిటీ అధికారులు బుధవారం సాయంత్రం మీడియాకు తెలిపారు.

వైభవంగా వినాయక కల్యాణం



కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి కల్యాణం నిర్వహించిన దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మ ప్రచార ప్రరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార మహోత్సవాలలో భాగంగా శ్రీ బలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, సౌదామిని దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 7 గంటలనుంచి శ్రీకాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి విశిష్ట గణపతి హోమం నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి తీర్థప్రసాదాలను భక్తులకు వితరణ చేశారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లను ఆయా దేవస్థానాల నిర్వహణ అధికారులు, సిబ్బందితోపాటు శ్రీ బలుసులమ్మ అమ్మవారి దేవస్థానం ఈఓ రవిశంకర్, ఆలయ చైర్మన్ కొట్టు అంజిబాబు, కర్రి భాస్కరరావు, వట్టిప్రోలు రాము, అప్పన రమేష్‌కుమార్ పర్యవేక్షించారు.

క్లుప్తంగా

భీమవరంలో యూబీఐ మెగా రిటైల్ ఎక్స్‌పో


యూబీఐ ఖాతాదారులకు రుణ మంజూరు పత్రాలను అందిస్తున్న సంగీతకుమారి

భీమవరం: యూనియన్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) ఆధ్వర్యంలో మెగా రిటైల్ ఎక్స్‌పో కార్యక్రమాన్ని బుధవారం స్థానిక డీఎన్నార్‌కళాశాల సెమినార్ హాల్లో యూబీఐ రీజనల్ హెడ్ పి సంగీతకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూబీఐ తక్కువ వడ్డీ రేటుకే హౌసింగ్, కార్, ఎడ్యుకేషన్ లోన్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 28 మంది ఖాతాదారులకు రూ. 6 కోట్ల రుణాల మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌హెచ్ ఆర్.దివాకర్, రిటైల్ లోన్‌పాయింట్ హెడ్ ఎస్.రమేష్, ఎస్‌వీపీ రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాలకొల్లు అర్బన్: మండలంలోని దిగమర్రు బైపాస్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు స్టేషన్ రైటర్ మూర్తి తెలిపారు. వివరాల ప్రకారం దిగమర్రు బైపాస్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం పాలకొల్లు నుంచి కాకినాడ వెళుతున్న సేనాపతి మాణిక్యం (58) ను ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయపడ్డ మాణిక్యం నుంచి హుటాహుటిన కాకినాడ తరలించగా, అక్కడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు సేనాపతి శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు మృతుడి స్వస్థలం కాకినాడ అని పని నిమిత్తం మంగళవారం ఆయన పాలకొల్లు వచ్చారని పోలీసులు తెలిపారు.

బీసీలకు అగ్రతాంబూలం

- మూడు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఎన్నికల పరిశీలకులుగా బీసీలకే ప్రాధాన్యం
- బీసీల్లో వెల్లివిరుస్తున్న సంతోషాలు


సమావేశంలో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి బీసీల పక్షపాతిగా నిరూపించుకున్నారంటూ జిల్లాలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఏలూరు పార్లమెంటు స్థానాన్ని బీసీ యువనాయకుడు, మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కుమారుడు కారుమూరి సునీల్ కుమార్‌కు కేటాయించిన సంగతి విదితమే. తాజాగా నియోజకవర్గాల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకుల నియామకాలలో సైతం బీసీలకు సీఎం వైఎస్ జగన్ పెద్ద పీట వేశారు.ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, దెందులూరు నియోజకవర్గానికి టీటీడీ బోర్డు సభ్యులు నెరుసు నాగ సత్యం, చింతలపూడి నియోజకవర్గానికి మురుగుడు సూర్యనారాయణలను నియమించారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో మూడు స్థానాల్లో బీసీలకు ఇవ్వడం పట్ల ఏలూరు జిల్లాలోని బీసీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గతంలో గౌరవం దక్కలేదు

రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ బీసీలకు ఇంతటి గౌరవం దక్కలేదని బీసీ సంఘాల నాయకులు చెబుతున్నారు. బీసీలంటే కేవలం ఎన్నికల్లో ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేశారే తప్ప పదవులు, నామినేటెడ్ పోస్టులు కేటాయింపుల్లో మొండి చేయి చూపేవారని గుర్తు చేశారు. గత పాలకులకు భిన్నంగా ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ బీసీలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని గుర్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

సీఎంగా వైఎస్ జగన్‌కు రెండోసారి పట్టం కట్టాలి

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇంత గొప్పగా బీసీలకు ప్రాధాన్యత,గౌరవం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రెండో సారి ముఖ్యమంత్రి పీఠంపై కూర్చుబెట్టాల్సిన అవసరం ఉందని బీసీ సంఘాల నేతలు గుర్తు చేస్తున్నారు. దీని కోసం ప్రతి బీసీ రేపు జరగబోయే ఎన్నికల్లో స్టార్ క్యాంపెయినర్‌గా పని చేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయానికి కంకణం కట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీసీ సంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు.

బీసీలకు గౌరవం



రాష్ట్రంలోని బీసీలకు ఎన్నడూ ఇంతటి గౌరవం, ప్రాధాన్యత దక్కలేదు. అట్టడుగున ఉన్న బీసీలకు రాజ్యాధికారం కల్పించే దిశగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ నిరంతరం కృషి చేయడం అభినందనీయం. ఇప్పటికే చట్ట సభల్లో, నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వస్తున్న సీఎం వైఎస్ జగన్ తాజాగా పార్టీ పదవుల్లోనూ బీసీలకు అగ్రతాంబూలం ఇవ్వడం గొప్ప విషయం.

– ఘంటా ప్రసాదరావు,
ఏలూరు నియోజకవర్గ పరిశీలకుడు

సాధారణ వ్యక్తులకు అసాధారణ పదవులు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లో సాధారణ వ్యక్తులను సైతం గుర్తింపు నిచ్చి అందలం ఎక్కిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుంది. బీసీలంటే బ్యాక్ వర్డ్ క్లాస్ కాదని, బ్యాక్ బోన్ అని నిరూపించిన ఏకైక వ్యక్తి వైఎస్ జగన్. వచ్చే ఎన్నికల్లో బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మళ్లీ సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– నెరుసు నాగ సత్యం,
దెందులూరు నియోజకవర్గ పరిశీలకుడు

సీఎం వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు



బీసీలకు సముచిత గౌరవం, ప్రాధాన్యత, అవకాశాలు కల్పిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు. జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలను అన్ని విధాలుగా ఆదుకుంటున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్. బీసీల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయడం సీఎం వైఎస్ జగన్‌కు బీసీలపై ఉన్న ప్రేమానురాగాలకు నిదర్శనంగా నిలుస్తుంది.

– మురుగుడు సూర్యనారాయణ,
చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు

గోడ కూలి ఐదేళ్ల చిన్నారి మృతి


విజయలక్ష్మి మృతదేహం


మృతి చెందిన చిన్నారి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కారుమూరి

తణుకు : రోడ్డుపై నడిచి నడిచి వెళుతుండగా అకస్మాత్తుగా గోడ కూలిన ఘటనలో ఐదేళ్ల చిన్నారి మృతి చెందిన ఘటన తణుకులో చోటు చేసుకుంది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ఇరగవరం మండలం పేకేరు గ్రామానికి చెందిన చిక్కా విజయలక్ష్మి (5) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పేకేరు గ్రామానికి చెందిన చిక్కా నరసింహారావు, వేణి దంపతుల ఏకైక కుమార్తె విజయలక్ష్మి. ఇటీవల నరసింహారావు అనారోగ్యం కారణంగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో చిన్నారి విజయలక్ష్మికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో సోమవారం తణుకులోని ప్రైవేటు ఆసుపత్రికి తల్లి తీసుకువచ్చారు. సాయంత్రం కావడంతో పట్టణంలోని 19వ వార్డులో బలిజేపల్లివారి వీధిలో నివాసం ఉంటున్న బంధువుల ఇంట్లో ఉండిపోయారు. మరుసటి రోజు మంగళవారం సాయంత్రం ఇంటికి వెళ్లే క్రమంలో ఆటో ఎక్కేందుకు మెయిన్‌రోడ్డుపైకి నడిచి వెళుతుండగా రోడ్డు పక్కనే శిథిలావస్థకు చేరిన గోడ అకస్మాత్తుగా కూలిపోయింది. ఈ ఘటనలో చిన్నారి విజయలక్ష్మి తీవ్రంగా గాయపడింది. గాయపడిన చిన్నారికి చికిత్స నిమిత్తం తణుకులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే లోపు మృతి చెందింది. తణుకు మున్సిపల్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థల యజమాని పెరవలి మండలం గుడిమెట్ల రమాదేవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు.

చిన్నారి కుటుంబానికి పరామర్శ

తణుకు అర్బన్ : దురదృష్టవశాత్తూ గోడ కూలి అభం శుభం తెలియని ఒక చిన్నారి మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో ఈనెల 27వ తేదీ సాయంత్రం స్థానిక 19వ వార్డు బలిజేపల్లి వారి వీధిలో గోడ కూలి సమీపంలో ఉన్న చిక్కా విజయలక్ష్మి (5) చిన్నారి మృతిపట్ల మంత్రి కారుమూరి సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. చిన్నారి మృతి తీవ్రంగా బాధించిందని, ప్రభుత్వం నుంచి అందాల్సిన సాయాన్ని తక్షణమే వచ్చేట్లుగా అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ప్రహరీకి సంబంధించిన యాజమానిపై కేసు నమోదుచేయాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న ప్రహరీల తొలగింపు విషయంలో మునిసిపల్ అధికారులు ఇకపై చాలా అప్రమత్తంగా ఉండాలని మంత్రి కారుమూరి సూచించారు. ఆయన వెంట ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య తదితరులు ఉన్నారు.

భాషను బతికించడంలో ముందు వరుసలో ఉండాలి


పెనుగొండ ఎస్వీకేపీలో అంతర్జాతీయ తెలుగు సదస్సు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: తెలుగు భాష అమ్మ భాషని అలాంటి భాషను రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందు వరుసలో ఉండాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఉప కులపతి కె.పద్మరాజు అన్నారు. బుధవారంపెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాలలో నిర్వహించిన రెండో అంతర్జాతీయ తెలుగు సదస్సులో పాల్గొన్నారు. తెలుగు భాష ఎంతో ప్రాచీనమైందన్నారు. తెలుగు సంపద సంచాలకులు , భారత ఉపగ్రహ సంస్థ ప్రతినిధి డాక్టర్ మూర్తి రేమేళ్ల మాట్లాడుతూ ఇలాంటి ప్రపంచ స్థాయి తెలుగు భాష సదస్సును ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. తెలుగు భాషను పరిరక్షించుకోవాలని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపకులపతి జార్జ్ విక్టర్ అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, పర్వతనేని సుబ్బారావు, వరప్రసాద్, సినీ గేయ రచయిత రసరాజు తెలుగు భాష గొప్పతనం వివరించారు. ఎంతో మంది రాజులు తెలుగు భాషను పోషించారన్నారు. కార్యక్రమంలో భాష్యం పాఠశాల విద్యార్థులు నృత్య ప్రదర్శన ఆకట్టుకొంది. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్ పాల్గొన్నారు.

శ్రీవారి శోభను మరింత పెంచేలా అభివృద్ధి

- త్వరలో ఆలయం చుట్టూ మాడ వీధుల నిర్మాణం
- డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు వెల్లడి


శ్రీవారి కొండపై అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత

ద్వారకాతిరుమల: శ్రీవారి శోభను మరింత పెంచేలా క్షేత్రంలో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం, రాష్ట్ర దేవదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. శ్రీవారి కొండపైన రూ.16.70 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనితలు ధర్మ అప్పారాయ నిలయంపై రూ.10 కోట్ల వ్యయంతో రెండవ అంతస్తులో సూట్ రూముల నిర్మాణానికి, అలాగే పార్కింగ్ ప్రాంతంలో రూ. 6.30 కోట్ల వ్యయంతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. స్వామివారి నిత్య కల్యాణ మండపం పక్కన ఒక దాత రూ.40 లక్షలతో నిర్మించిన సహస్ర దీపాలంకరణ సేవ మండపాన్ని ప్రారంభించారు. అనంతరం ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు, ఈఈ డీవీ భాస్కర్‌లు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్లాన్‌లను చూపించి, మంత్రులకు వాటిని వివరించారు. దర్శనానంతరం మంత్రి కొట్టు, హోం శాఖ మంత్రి వనితతో కలిసి మీడియాతో మాట్లాడారు. మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా తిరుమల తిరుపతి తరహాలో ఇక్కడ ఆలయం చుట్టూ మాడవీధులు నిర్మించనున్నట్టు తెలిపారు. ఆ మాడవీధుల్లో ఎటువెళ్లినా భక్తులకు ప్రసాదాలు అందేలా కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో అగ్రిమెంట్ల ప్రక్రియను పూర్తవుతుందని, ఆ తర్వాత మాడవీధుల నిర్మాణానికి టెండర్ ప్రక్రియ మొదలవుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ సభ్యుడు చిగురుపల్లి శామ్యూల్, ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావు, ట్రస్టుబోర్డు సభ్యులు పెద్దిరెడ్డి పద్మజ్యోతి, మానుకొండ సుబ్బారావు, ఆచంట అనసూయ, తానంకి గంగరాజు, వాసే రామకృష్ణ, నూకల అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్, కార్గో పోర్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన


ఫిషింగ్ హార్బర్, కార్గో పోర్ట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: నరసాపురం తీరప్రాంత మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు ఫిషింగ్ హార్బర్, కార్గో పోర్ట్ నిర్మాణం ఎంతగానో దోహద పడుతుందని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండలం తీర ప్రాంత గ్రామమైన చినమైనవానిలంక గ్రామంలో రూ.430కోట్లతో నిర్మించనున్న ఫిషింగ్ హాఃఆర్బర్, కార్గో పోర్ట్ నిర్మాణ పనులకు బుధవారం ఆయన భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరసాపురం ఎన్నో ఏళ్ల ఫిషింగ్ హార్బర్ చిరకాల కోరిక ఎట్టకేలకు సాకారమవుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎనిమిది ఫిషింగ్ హార్బర్, కార్గో పోర్ట్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. చినమైనవానిలంక గ్రామంలో కూడా నిర్మాణ పనులు వేగంగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు వస్తామన్నారు. ఫిషింగ్ హార్బర్ కార్గోపోర్టు నిర్మాణం కొసం భారీ వాహనాలు సామగ్రి తో వచ్చేందుకు అనువుగా ఉండేందుకు నల్లీక్రీక్ పై శిథిలమైన వంతెన స్థానంలో రూ.1.50 కోట్లతో నూతనంగా వంతెన నిర్మాణం చేపడుతున్నామన్నారు. బియ్యపుతిప్పలో రూ.10 కోట్లతో ఫిషింగ్ ప్లాంట్ కూడా నిర్మించనున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఏఎంసీ చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కారాధాకృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అండ్రాజు చల్లారావు, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, దొంగ మురళీకృష్ణ, సంగాని మోహనరావు పాల్గొన్నారు.

పట్టిసం ఏర్పాట్లపై సమీక్ష


పట్టిసం ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ లావణ్యవేణి

పోలవరం రూరల్: పట్టిసం మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు చేసే ఏర్పాట్లను అధికార యంత్రాంగం సమన్వయంతో పక్కాగా ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. పోలవరం మండలం పట్టిసం శివక్షేత్రం వద్ద ఉత్సవ ఏర్పాట్లపై రెండవ దఫా సమావేశం జిల్లా స్థాయి అధికారులతో బుధవారం నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలకు సుమారు 2లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగిన రీతిలో ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులు క్యూలైన్‌లలో ఎక్కువ సేపు నిలబడకుండా దైవదర్శనం చేసుకుని వచ్చే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు వారు చేపట్టే పనులను ఈ నెల 4 నాటికి పూర్తి చేయాలన్నారు. స్పీడ్ బోట్లతో గోదావరి నదిలో హెచ్చరికలు చేస్తూ పోలీస్ పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. ఇసుక తిన్నెలపై రాత్రి భక్తులు జాగారం చేస్తారన్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్‌సరఫరా చేయాలన్నారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించి గోడపత్రికను జేసీ ఆవిష్కరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని క్యూలైన్‌లను పరిశీలించారు. డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్, డీఎస్పీ ఎన్.సురేష్‌కుమార్ రెడ్డి, రవాణాశాఖ ఉప కమిషనర్ ఎస్.శాంతకుమారి, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రంగారావు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టును ఢీకొన్న లారీ

చెట్టు విరిగిపడడంతో వ్యక్తి దుర్మరణం

పాలకోడేరు: పాలకోడేరులో బుధవారం రాత్రి ఓ లారీ బీభత్సం సృష్టించింది. మోగల్లు వెళ్లే రోడ్ లో కొత్తపేట కొబ్బరి చెట్ల వద్ద వేసిన రాళ్లపై కూర్చుని ఉన్న వారిపై దూసుకెళ్లింది. అయితే ఆ సమయంలో కొబ్బరిచెట్టును ఢీకొట్టడంతో అది అక్కడే ఉన్న తోట వెంకటేశ్వర్లు (40) పడింది. దీంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతదేహం వద్ద భార్య, కుమార్తెలు బోరున విలపించారు. ఘటనకు కారణమైన డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

క్లుప్తంగా

శ్రీ కృష్ణ యోగధాన్య మందిరంలో ప్రత్యేక పూజలు



అభయ గణపతికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మాఘ బహుళ చవితి సంకష్టహర చవితి పురస్కరించుకుని రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో బుధవారం సాయంత్రం అభయ గణపతికి అర్చనలు, పంచామృత అభిషేకాలు ఘనంగా జరిగాయి. నూతన వస్త్రాలు, పూలదండలు అలకరించి స్వామి వారికి శ్వేతార్క పుష్పాలతో సహస్ర అష్టోత్తర పూజలు జరిగాయి. ఈ కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో తణుకులో ధర్నా



తణుకులో కార్మికశాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

తణుకు: విజయనగరం జిల్లాలో మిమ్స్ వైద్య కళాశాల యాజమాన్యం మొండి వైఖరి విడనాడి సమస్యల కోసం పోరాడుతున్న ఉద్యోగులకు అండగా ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ కోరారు. బుధవారం తణుకు కార్మికశాఖ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యూనియన్ ఏర్పడిన తర్వాత నాలుగు పర్యాయాలు వేతన ఒప్పందం జరిగిందన్నారు. 2019, 2020, 2023 సంవత్సరాల్లో చేయాల్సిన వేతన ఒప్పందాలు చేయకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మిక శాఖ తక్షణమే జోక్యం చేసుకుని యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.దక్షిణామూర్తి, మండల అధ్యక్షులు ఎస్.ఆదినారాయణబాబు, జ్యోతిబాబు, సుధీర్, వాసు, అయ్యప్ప, నాగేంద్ర కుమార్, కేశవ, భద్రం, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్‌ను మార్చే శక్తి యువతదే



ఉద్యాన కళాశాలలో విజన్ ఇండియా కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం యువ సంవాద్ ఇండియా2047 అనే కార్యక్రమం జరిగింది. ఉద్యాన కళాశాల విద్యార్థులు, ఆది కవి నన్నయ్య విశ్వవిద్యాలయానికి చెందిన పీజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ భవిష్యత్‌ను మార్చడం యువత చేతుల్లోనే ఉందని పలువురు వక్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.భోగేశ్వరరావు, ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధవి, విద్యార్థి వ్యవహారాల డీన్ సలోమి సునీత, ఎన్ఎస్ఎస్ అధికారులు శివకుమార్, ఉదయశ్రీ పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదరించాలి



దివ్యాంగులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేటలోని దివ్యాంగుల పాఠశాలలో బుధవారం దాతలు సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ దివ్యాంగులను ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, దాత వెంకటాచలం, దివ్యాంగుల పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి

భీమవరం: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భీమవరంలోని వీరమ్మ పార్క్ వద్ద గల పార్వతీసమేత భోగలింగేశ్వరస్వామి ఉత్సవాల కరపత్రాలను బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆవిష్కరించారు.

వలంటీర్లు.. సంక్షేమ రథ సారథులు

- పారదర్శకంగా సంక్షేమం అందజేసిన ఘనత వలంటీర్లదే
- వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి కారుమూరి



తణుకులో సత్కారం పొందిన వలంటీర్లతో మంత్రి కారుమూరి, చిత్రంలో కమిషనర్ బీవీ రమణ

తణుకు అర్బన్: ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉన్న వలంటీర్లు సంక్షేమ రథ సారథులుగా నిలిచారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు మున్సిపల్ బాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి మంత్రి కారుమూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రూపొందించిన సంక్షేమ పథకాలను ప్రజల గడపలోకి తీసుకువెళ్లడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు పారదర్శకంగా సంక్షేమాన్ని అందించే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీరు వ్యవస్థ కోవిడ్ సమయంలో అందించిన సేవలు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయని ప్రశంసించారు. కోవిడ్ వ్యాప్తి పెరగకుండా నిలిపేందుకు ఇతర రాష్ట్రాలు తీవ్ర ఇబ్బందులు పడ్డాయని, కానీ ఏపీలో మాత్రం వలంటీరు వ్యవస్థ ద్వారా ఇతర దేశాల నుంచి వచ్చిన వారిని గుర్తించి క్వారంటైన్‌లో ఉంచారని స్పష్టం చేశారు. అంతేకాకుండా కోవిడ్ సమయంలో రెడ్ జోన్‌లలోకి వెళ్లి మరీ వలంటీర్లు ప్రజలకు అందించిన సేవలు వెలకట్టలేనివని గుర్తుచేశారు. సేవ చేసే వారంటే నాకు చాలా ఇష్టమని అటువంటి సేవలో నిమగ్నమైన వలంటీరు వ్యవస్థను నేను అమితంగా ఇష్టపడుతున్నట్లు చెప్పారు. తణుకు నియోజకవర్గంలో రూ. 3300 కోట్లు సంక్షేమం, అభివృద్ధి జరిగిందంటే వలంటీరు చేసిన కృషేనని కొనియాడారు. మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ మాట్లాడుతూ ప్రజలకు వలంటీర్లు అందిస్తున్న సేవలకు ప్రభుత్వం పురస్కారాలు అందజేస్తుందన్నారు. తణుకు పట్టణ పరిధిలో 439 మంది వలంటీర్లకు సేవామిత్ర, 5గురికి సేవా రత్న అవార్డులు దక్కాయని చెప్పారు. సేవా మిత్రకు రూ. 15వేలు, సేవా రత్నకు రూ. 30వేలు చొప్పున వీరందరికి మొత్తం రూ. 67.35 లక్షలు వారి బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం జమచేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా తణుకు పట్టణ పరిధిలోని 34 వార్డులకు సంబంధించిన వలంటీర్లను మంత్రి కారుమూరి చేతులమీదుగా సత్కరించి మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, ఏఎంసీ చైర్మన్ నత్తా కృష్ణవేణి, వైస్‌చైర్మన్ మారిశెట్టి శివశంకర్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు ఫహీమా, మారిశెట్టి శేషగిరి, డీజే అమూల్యారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు తణుకులో మెగా జాబ్ మేళా

తణుకు టౌన్: ఈనెల 29వ తేదీన తణుకులోని శ్రీ చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్‌కుమార్ తెలిపారు. గురువారం తణుకులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర కళాశాల విద్యా శాఖా జేకేసీ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర కళాశాల విద్యా శాఖా కమీషనర్ పోలా భాస్కర్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. తణుకు, తాడేపల్లిగూడెం ఎస్ఆర్‌సీ పరిధిలోని అన్ని డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చాన్నారు. ఈ జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు ఆఫర్స్ లెటర్స్‌ను మంత్రి కారుమూరి, కమీషనర్ భాస్కర్ చేతులు మీదు అభ్యర్థులకు అందజేస్తారని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డా.అనిల్ కుమార్ తెలిపారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన



ఇరగవరంలో ఆర్ కండ్రిక గ్రామంలో శిలాఫలాకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారు ల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం ఇరగవరం మండలం ఏలేటిపాడు గ్రామంలో రూ. 1.50 లక్షలతో నిర్మించిన కెనాల్ రోడ్డు, 50లక్షలు దాతల సహకారంతో నిర్మించిన విఘ్నేశ్వర ఆలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. విద్య, వైద్య రంగంలోనే దేశంలోనే మన రాష్ట్రంమొదటి స్థానంలో ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. మహిళలకు అన్ని రంగాల్లోనూ సీఎం గుర్తింపునిచ్చారని తెలిపారు. మహిళల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులు చేపట్టిన జగనన్నకు రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. గ్రామాల్లో రోడ్లు, డ్రెయినేజీ, కెనాల్ రోడ్డులు పెద్ద ఎత్తున అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద అన్న సమారధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ వెలగల సాయిబాబా రెడ్డి, జెసిఎస్ దినేష్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి ద్వారంపూడి సత్యనారాయణ రెడ్డి, కొవ్వూరి శ్రీనివాస్ రెడ్డి బాబు, చోడు జోషి ,చోడే ఏసురత్నం, సొసైటి అధ్యక్షుడు సత్తిబాబు, సర్పంచ్ గుడాల లక్ష్మీ శ్రీనివాస్, కార్యదర్శి బి లక్ష్మీ నారాయణ, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ



ఆనందపురంలో కొలువైన సీతారాములు

కాళ్ల: ఆనందపురం గ్రామం ఆధ్యాత్మిక చింతనతో నిండిపోయింది. కోదండరామాలయం ప్రతిష్ఠ, అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమాలు బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామమంతా భక్తిపారవశ్యంతో నిండిపోయింది. వేదమంత్రాల నడుమ హనుమద్ సీత, లక్ష్మణ భరత, శత్రుఘ్న సహిత శ్రీరామచంద్ర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని భక్తుల నడుమ వేద మంత్రాలతో భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. భక్తులు, దాతలు, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన కోదండరామాలయం, అభయాంజనేయస్వామి విగ్రహాలు ప్రారంభోత్సవంలో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉద్దరాజు శ్రీనివాసరాజు, ముదునూరి సాయిరాజు, బండారు దుర్గారావు, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా టైలర్స్ డే వేడుకలు



అత్తిలి: టైలర్స్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

అత్తిలి: కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే జన్మదినోత్సవాన్ని పురష్కరించుకుని టైలర్స్‌డే వేడుకను బుధవారం అత్తిలిలో టైలర్స్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విలియమ్స్ హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టైలర్స్ సంఘం ఉపాధ్యక్షుడు ఆర్పీ జయకృష్ణ మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన ప్రతి టైలర్‌కు పింఛన్, టైలర్‌షాపు ఉన్న ప్రతి ఒక్కరికి ఉచిత విద్యుత్ సదుపాయం ప్రభుత్వం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి మండల టైలర్స్ సంఘం అధ్యక్షుడు సీఎస్ రావు, సెక్రటరీ కసిరెడ్డి వెంకట అప్పారావు, జాయింట్ సెక్రటరీ ఈదూరి ప్రసాద్, కోశాధికారి ఎన్ మురళీకృష్ణ, సభ్యులు గుబ్బల శ్రీను, జి రామచంద్రరావు, ఎన్ రాము, పీవీ రమణ, పీవీ సుబ్బారావు, టి కొండ, టి శేఖర్, కె గీత, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో ప్రపంచ టైలర్స్ దినోత్సవం

తణుకు: కుట్టుమిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే జయంతి పురస్కరించుకుని ప్రపంచ టైలర్స్ దినోత్సవాన్ని బుధవారం తణుకులో నిర్వహించారు. శ్రీగంగయ్య టైలర్స్ ప్రాథమిక సహకర సంఘం అధ్యక్షుడు కత్తుల దానవెంకటసుబ్బారావు అధ్యక్షతన స్థానిక సీతారామాంజనేయ స్వామి గుడి ఆవరణలో కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్స్ హోవే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సొసైటీ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ, కోశాధికారి నూకెళ్ల వెంకటరత్నం, ముంగండ శ్రీనివాస్, గుత్తికొండ సుబ్బారావు, పొడుగు విజయభారతి, రాసాబత్తుల పుల్లారావు, ఏలూరి త్రిమూర్తులు, భాస్కర్ల అనంతలక్ష్మి, రెడ్డి సూర్యనారాయణ, ఆనందరావు, దర్జీలు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం(టీఓసీ):నూతన అధ్యక్షుడు గంజి బొబ్బిలి అభినందిస్తున్న టైలర్లు



తణుకు: విలియమ్స్ హోవే విగ్రహానికి నివాళ్లుర్పిస్తున్న దర్జీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో టైలర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. విలియం హోవే విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లుర్పించారు. అనంతరం సభకు చాపల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. టైలర్స్ సంఘం గౌరవాధ్యక్షుడిగా షేక్ బాజీ, సంఘం అధ్యక్షుడిగా గంజి బొబ్బిలి, కార్యదర్శిగా బాయిశెట్టి శ్రీనివాస్, కోశాధికారిగా కొమ్మన రమణ, వర్కింగ్ కమిటీ సభ్యులు తడాల వెంకటేశ్వరరావు, తోట భవాని శ్రీను, దోసూరి నాని, పరమేశ్వరం, నూకపల్లి సురేష్, మాసాభత్తుల నరేష్ తదితరులు సభలో పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయం



టిడ్కో కాలనీలో చర్చిని ప్రారంభిస్తున్న శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: ఏసుక్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయమని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. భీమవరంలోని తాడేరు రోడ్డులోని టిడ్కో కాలనీలో యోవేలు మినిస్ట్రీ చర్చిని బుధవారం మోషేన్‌రాజు ప్రారంభించి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నప్పుడు నమ్మకంతో ఏసుక్రీస్తు ప్రభువును ప్రార్థిస్తే ఆ సమస్యలు తొలగిపోతాయన్నారు. ఏసుక్రీస్తు ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. చర్చి పాస్టర్లు ప్రార్థనలు చేశారు.

నూతన ఆవిష్కరణలతోనే బంగారు భవిష్యత్తు



అత్తిలి: బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సైన్సు ప్రదర్శనలు తిలకిస్తున్న హెచ్ఎం దత్



తణుకు అర్బన్: విజేతలైన విద్యార్థులు



తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌లో జాతీయ సైన్స్ దినోత్సవంలో రిజిస్ట్రార్ దినేష్ శంకర్‌రెడ్డి తదితరులు

అత్తిలి: నూతన ఆవిష్కరణలతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు సాధ్యపడుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైఎస్సార్ సీఎం దత్ చెప్పారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం మాట్లాడారు. డాక్టర్ సీవీ రామన్ భౌతికశాస్త్రంలో పరిశోధనల ఫలితంగా రామన్ ఎఫెక్ట్ కనిపెట్టారని, 1987 నుంచి ఫిబ్రవరి 28న జాతీయ విజ్ఞాన దినోత్సవంగా జరుపుకుంటామని చెప్పారు. ఈ ఏడాది వికసిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికత అనే అంశానికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా సైన్సు ఉపాధ్యాయులు డీఎంజీ ప్రసాద్, ఎస్కే మల్లేశ్వరరావు, ఎన్ సుజాతదేవి, ఎంజీఆర్కే రెడ్డిల ఆధ్వర్యంలో విద్యార్థులు పలు సైన్సు ప్రదర్శనలు ప్రదర్శించారు. సైన్సు ముగ్గుల పోటీలు, క్విజ్ ప్రోగ్రాములు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్ బాలసుబ్రహ్మణ్యం, ఎస్ పురుషోత్తం, శ్రీహర్ష, శ్రీనివాసరావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణపురంలో

జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా అత్తిలి మండలం లక్ష్మీనారాయణపురం ఎంపీయూపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనను మండల విద్యాశాఖాధికారులు ఎస్ రమేష్, ప్రసాద్‌లు తిలకించారు. ఈసందర్భంగా ఎంఈవో రమేష్ మాట్లాడుతూ భారతరత్న సీవీ రామన్ కనుగొన్న రామన్ ఎఫెక్ట్ ఫలితంగా ఈరోజున సైన్సు దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంపీ సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం, తెలియని విషయాన్ని తెలుసుకోవడం ద్వారా విజ్ఞానవంతులు కాగలరని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి రమాప్రభ, నాగేశ్వరరావు, త్రివిక్రమరావు, ప్రసాద్, కనకరాజు, పాల్గొన్నారు.

ఏపీ కాస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ పోటీలు

తణుకు అర్బన్: సైన్స్ డే సందర్భంగా తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఏపీ కాస్ట్) ఆధ్వర్యంలో విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానం ఆవశ్యకత అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్ సైన్స్ ప్రయోగాల ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏపీ కాస్ట్ జిల్లా కోఆర్డినేటర్ చీలి రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు జె.ఉమాదేవి, వెంకటలక్ష్మి, పాల్ డేవిడ్ రాజు, సులోచన, రాంబాబు, కోటయ్య, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలపై విద్యార్థులు ఆశక్తి చూపాలి

తణుకు టౌన్: విద్యార్థులు ఏం చదివినా చివరకు కంప్యూటర్ కోర్సుల్లో చేరి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఆసక్తి చూపుతున్నారని అయితే అంతరిక్ష పరిశోధనలపై కూడా ఆశక్తి చూపాలని ఇస్రో సీనియర్ శాస్త్రవేత్త, టెలిమెడిసిన్ సొసైటీ ఆఫ్ ఇండియా గౌరవ కార్యదర్శి డాక్టర్ మూర్తి రేమిళ్ల చెప్పారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తణుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ అనిల్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మూర్తి రేమిళ్ల మాట్లాడుతూ సైన్స్ అంటే ఏమిటి?, ఎందుకు?, ఎలా? అనే ప్రశ్నలను పరిశోధన చేసి తెలుసుకోవడమే సైన్స్ అని చెప్పారు. మన దేశంలో వంద సంవత్సరాల క్రితం సర్ సీవీ రామన్ సైన్స్‌లో నోబెల్ బహుమతి అందుకున్నారన్నారు. విద్యార్థులు నోబెల్ ప్రైజ్ అందుకునే స్థాయి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర విద్యా శాఖా జేకేసీ చీఫ్ ఏ రామ్‌గోపాల్ మాట్లాడుతూ మానవ జాతి మనుగడ కోసం నిరంతరం చేసే ప్రయత్నమే సైన్స్ అని చెప్పారు. సైన్స్‌లో నిరంతరం పరిశోధనలు జరగాలన్నారు. ఈ సందర్భంగా సర్ సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ ఏడుకొండలు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్కే ఫణిధర్, టీ సంధ్యా రాణి, రామ్‌భూపాల్, ఏ మారుతీదేవి చౌదరి, సీహెచ్ దేవి, రవీంద్రబాబు, నాగభూషణ్ రెడ్డి, కిరణ్మయి, ప్రదీప్, రఘునాథరెడ్డి, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో....

సైన్స్ సాధించిన ప్రగతి వలన మనిషికి ఎన్నో ప్రయోజనాలు కలిగాయని ప్రముఖ మానశిక వైద్య నిపుణులు డాక్టర్ కుడారి ఆనంద్ చెప్పారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా తణుకులోని ఎస్కెఎస్‌డీ మహిళా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ కె రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వివేకానంద గ్లోబల్ స్కూల్ కార్యదర్శి చిట్టూరి రీనా సాయి, ఇతర అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలపై దృష్టి సారించాలి

తాడేపల్లిగూడెం: దేశ ఆర్థిక వ్యవస్థకు సాంకేతిక, ఇంజనీరింగ్ పరిశోధనలు, సైన్స్ మూలస్తంభాలుగా నిలుస్తాయని బుధవారం ఏపీ నిట్‌లో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవంలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి అన్నారు. విద్యార్థులు సైన్స్ ఆధారిత ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. రామన్ ఎఫెక్ట్‌ను కనుగొని భారత ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఘనత సీవీ రామన్‌కే దక్కుతుందన్నారు. దేశం తరపున మొట్టమొదటి నోబెల్ బహుమతిని అందుకుని భారత శక్తి సామర్థ్యాలను చాటి చెప్పిన వ్యక్తి సర్ సీవీ రామన్ అన్నారు. సృజనాత్మక ఆలోచనలకు విద్యార్థులు ఆధునిక సాంకేతికతను జోడించి నూతన ఆవిష్కరణలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వీరేష్ కుమార్, నిట్ అధికారులు శాస్త్రి, సందీప్, రాములు, తపస్, కిరణ్‌కుమార్, రఫీ పాల్గొన్నారు.